క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



చండీ హోమంలో పాల్గొన్న భక్తులు

యానాం: కనకాలపేటలో కొలువైన గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం చండీ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా యానాం పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి విశేష పూజల్లో పాల్గొన్నారు. బ్రహ్మశ్రీ కోనంభట్ల శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో పోలేరమ్మ వారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, సామూహిక సహస్ర కుంకుమార్చన చేశారు. అనంతరం అన్న ప్రసాద వితరణ జరిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ, పోలేరమ్మ యూత్ పాల్గొన్నారు.

చిన్నతనం నుంచే నైతిక విలువలు

అమలాపురం టౌన్: బాల వికాస్ తరగతుల ద్వారా పిల్లలకు చిన్నతనం నుంచే నైతిక విలువలు అలవడతాయని అమలాపురం డివిజన్ శ్రీసత్యసాయి సేవా సంస్థల కోఆర్డినేటర్ డాక్టర్ జి.ప్రభాకర్ అన్నారు. ఉప్పలగుప్తం మండలం వాసాలతిప్పలోని బాల వికాస్ కేంద్రం ఏర్పాటు సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 100 మంది బాల బాలికలతో కొత్త కేంద్రం ఏర్పాటైందన్నారు. చిన్నారులకు ఉదయమే ఓం కారం, ధ్యానం, గాయిత్రీ మంత్రం, నీతి కథలు, నైతిక విలువలు, కుటుంబ బంధాలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.

ఓటర్లు విశ్రాంతి తీసుకునేలా ఏర్పాట్లు



గొల్లవిల్లిలో పోలింగ్ స్టేషన్ వద్ద చేసిన ఏర్పాట్లు

ఉప్పలగుప్తం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలో ఉన్న 52 బూత్‌లను అధికారులు సిద్ధం చేశారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి బూత్‌లో తాగునీటిని అందుబాటులో ఉంచారు. ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఓటర్లు విశ్రాంతి తీసుకునేలా ఏర్పాట్లు చేశారు. ఆదివారం ప్రతి పోలింగ్ స్టేషన్‌కు సిబ్బంది ఈవీఎమ్ మెషీన్‌లతో చేరి పోలింగ్ సంబంధించిన ఏర్పాట్లు చేసుకున్నారు. పోలీసు బలగాలు గ్రామాల్లో కవాతులు నిర్వహించి భద్రతా చర్యలు చేపట్టారు.


ఏసీల వినియోగం తగ్గించండి

యానాం: యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి రీజియన్లలో ఉన్న వ్యాపార సంస్థలు సాయంత్రం 6 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకూ ఏసీల వినియోగం తగ్గించాలని కోరుతూ పుదుచ్చేరి విద్యుత్ నియంత్రణ సంస్థ మోనిటరింగ్ ఇంజినీర్ డాక్టర్ షణ్ముగం ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ సమయంలో విద్యుత్ వినియోగం అత్యధిక స్థాయికి చేరుకుంటుందని, దీనివల్ల నివాస ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఒక్కోసారి విద్యుత్ లైన్లు సైతం దెబ్బతింటున్నాయన్నారు.

ఘనంగా శంకరాచార్య జయంతి

అంబాజీపేట: ముక్కామల శ్రీఆది శంకరాచార్య స్వామివారి ఆలయంలో జగద్గురు ఆది శంకరాచార్య స్వామి జయంతి మహోత్సవాలను ఆదివారం నిర్వహించారు. కంచి కామకోటి పీఠాధిపతులు శంకర విజయేంద్ర సరస్వతి స్వామివారి అనుగ్రహంతో ఆలయ ధర్మకర్త దువ్వూరి బాలకృష్ణమూర్తి పర్యవేక్షణలో అర్చకుడు వెలవలపల్లి సుబ్రహ్మణ్యశాస్త్రి ఆధ్వర్యంలో శంకరాచార్య స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కంచి కామకోటి శైవాగమ పాఠశాల విద్యార్థులచే ఆది శంకరాచార్య స్వామివారికి వేదపఠనం నిర్వహించారు. అనంతరం స్వామివారికి గ్రామోత్సవం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఈదురు గాలులకు నేలకొరిగిన చెట్లు



రావులపాలెం కాలువ అవతలి రోడ్డులో నేలకూలిన భారీ వృక్షం

రావులపాలెం: రావులపాలెంలో ఆదివారం మధ్యాహ్నం ఈదురు గాలులతో కురిసిన వర్షానికి పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. భారీ వర్షాలకు చెట్లు నేలకొరగడంతో పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. స్థానిక భద్ర మహంకాళమ్మ పుంత, కాలువ అవతల రోడ్డుపై భారీ వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్ శాఖ సిబ్బంది వాటిని తొలగించేందుకు చర్యలు చేపట్టారు.



పోలింగ్ కేంద్రాలకు బస్సులలో తరలి వెళుతున్న ఎన్నికల సిబ్బంది



అమలాపురం డిస్ట్రిబ్యూషన్ సెంటరులో సిబ్బందికి సూచనలిస్తున్న రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో కేశవవర్ధనరెడ్డి



ముమ్మిడివరంలో పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్న సిబ్బంది



అమలాపురం డిస్ట్రిబూషన్ సెంటర్ నుంచి తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రానికి బస్సులో బయలుదేరుతున్న సిబ్బంది

నేడే ఓట్ల పండగ

- అమలాపురం నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలు 235
- ఎన్నికల విధుల్లో రెండు వేల మంది సిబ్బంది
- ఈవీఎంలతో పోలింగ్ కేంద్రాలకు తరలిన ఉద్యోగులు
- ఓటు హక్కు వినియోగించుకోనున్న 2,13,508 మంది ఓటర్లు

అమలాపురం టౌన్: ఓట్ల పండగ రానే వచ్చింది. సోమవారం ఓటర్లు తమ తుది తీర్పును ఇవ్వనున్నారు. సార్వత్రిక ఎన్నికల సమరానికి అధికారుల ఏర్పాట్లు పూర్తయ్యాయి. అమలాపురం నియోజర్గంలోని 2,13,508 మంది ఓటర్లు సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. నియోజకవర్గంలో పోలింగ్ నిర్వహణకు రెండు వేల మందికి పైగా ఉద్యోగులు విధులు నిర్వర్తించనున్నారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అమలాపురం ఆర్డీవో జి.కేశవవర్ధనరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రానికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పోలింగ్ నిర్వహణకు అవసరమైన ఈవీఎం యంత్రాలు, ఇతర పోలింగ్ సామగ్రిని సిబ్బందికి సోమవారం అప్పగించారు. దీంతో కళాశాల ప్రాంగణమంతా ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు, ఉద్యోగులతో నిండిపోయింది. అలాగే కళాశాలకు ఎదురుగా ఉన్న శ్రీ చెన్నమల్లేశ్వరస్వామి కళాక్షేత్రం స్థలంలో పోలింగ్ సిబ్బంది వెళ్లే బస్సులను నిలిపారు. దాదాపు 2 వేల మంది సిబ్బంది పోలింగ్ సామగ్రి తీసుకుని బస్సులెక్కి తమకు నిర్దేశించిన పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారు. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ కళాశాల వద్ద ఎన్నికల కోలాహలం కనిపించింది. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ జి.కనకరాజు ఎన్నికల సామగ్రి పంపిణీని పర్యవేక్షించారు. అమలాపురం రూరల్ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో డిస్ట్రిబూటరీ సెంటరు వద్ద బందోబస్తు ఏర్పాటుచేశారు.

ఒక్కో పోలింగ్ బూత్‌లో ఆరుగురు సిబ్బంది

నియోజకవర్గంలోని 235 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఒక్కో పోలింగ్ బూత్‌లో ఆరుగురు సిబ్బంది పనిచేస్తారు. ఒక్కో కేంద్రానికి ఆరు ఈవీఎం యంత్రాలు పంపిణీ చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో 266 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 280 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 1076 మంది ఇతర పోలింగ్ అధికారులు నియమితులయ్యారు. వీరితో పాటు 96 మంది మైక్రో అబ్జర్వర్లు, 180 మంది వెబ్ కాస్టింగ్ నిర్వాహక అధికారులు విధులు నిర్వర్తించనున్నారు. అంతేకాకుండా 250 మంది పోలీసు సిబ్బంది పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు విధుల్లో ఉంటారు.

ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 వరకూ

నియోజకవర్గంలోని 255 పోలింగ్ కేంద్రాలకు మొత్తం 1,410 ఈవీఎం యంత్రాలు కేటాయించారు. 85 రూట్లుగా విభజించి సిబ్బందిని, ఎన్నికల సామగ్రిని ప్రత్యేక బస్సుల్లో పంపించారు. 235 కేంద్రాల్లో 92 కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి అక్కడ ఎన్నికల సిబ్బందిని, పోలీస్ బందోబస్తును అదనంగా నియమించారు. 168 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు. పోలింగ్ ప్రక్రియ సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ నిర్విరామంగా జరగనుంది.

ఆధునిక సాంకేతికత వినియోగం

ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఆధునిక సాంకేతికతను వినియోగిస్తుంది. ఎన్నికల తీరును నిరంతరం పర్యవేక్షించేందుకు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలతో పాటు మరికొన్ని కేంద్రాల్లోనూ వెబ్ కాస్టింగ్ విధానాన్ని ఏర్పాటుచేశారు. అమలాపురం నియోజకవర్గంలోని 168 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ అమలుచేస్తున్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల లోపల ఒక కెమెరా, బయట మరొక కెమెరా చొప్పున రెండేసి నిఘా కెమెరాలు ఏర్పాటుచేశారు. పోలింగ్ జరగనున్న సోమవారం ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం పోలింగ్ ప్రక్రియ ముగిసేవరకూ అవి నిరంతరాయంగా పనిచేయనున్నాయి. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అల్లర్లు జరిగినా వెంటనే అప్రమత్తమయ్యేందుకు, బాధ్యులను గుర్తించేందుకు అవి ఎంతగానో ఉపయోగపడతాయి.

హోప్ ఐలాండ్ దీవికి తరలి వెళ్లిన సిబ్బంది

తాళ్లరేవు: సముద్రంలో అంతర్భాగంగా ఉన్న హోప్ ఐలాండ్ దీవిలో ఎన్నికల పోలింగ్ నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కోరంగి పంచాయతీలో ఉన్న ఈ మత్స్యకార ప్రాంతంలో 315 మంది ఓటర్లు ఉన్నారు. అక్కడ పోలింగ్ నిర్వహణకు పదిమంది ఎన్నికల సిబ్బంది ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బోటులో సుమారు రెండు గంటల పాటు ప్రయాణించి ఆదివారం హోప్ ఐలాండ్ చేరుకున్నారు.

అమలాపురం నియోజకవర్గంలో ఓటర్లు 2,13,508 మంది	
పురుషులు	1,06,268 మంది
మహిళలు	1,07,239 మంది
థర్డ్ జెండర్	1

ముమ్మిడివరం నియోజకవర్గంలో ఓటర్లు - 2,45,296 మంది	
పురుషులు	1,22,126 మంది
మహిళలు	1,23,170 మంది



ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు బయలుదేరుతున్న సిబ్బంది

ఎన్నికలకు సర్వం సిద్ధం

- పటిష్టమైన భద్రతా చర్యలు
- 268 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్

ముమ్మిడివరం: నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పోలింగ్ నిర్వహించనున్నారు. అధికారులు సోమవారం సాయంత్రానికే పోలింగ్ సామగ్రితో ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఇప్పటికే పోలింగ్ ఈవీఎంలను పోలింగ్ బూత్‌లకు తరలించారు. నియోజకవర్గంలో సమస్యాత్మక గ్రామాలను గుర్తించి పోలీస్ శాఖ ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకుంది. పోలింగ్ కేంద్రాల వద్ద 100 మీటర్ల పరిధిలో ఓటర్లు తప్ప ఎవరూ ఉండటానికి వీల్లేదని ఆంక్షలు విధించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు వెబ్ కెమెరాల ద్వారా ఎన్నికల ప్రక్రియను చిత్రీకరించనున్నారు.

నియోజకవర్గంలో 268 పోలింగ్ కేంద్రాలుండగా 25 సెక్టార్లుగా విభజించారు. 25 మంది జోనల్ అధికారులు, 25 మంది సెక్టార్ అధికారులను ఏర్పాటు చేశారు. 268 మంది పీఓలు, 268 ఏపీఓలు, 1027 మంది ఓపీఓలను నియమించారు. అదనంగా 20 శాతం పీఓలు, ఏపీఓలను సిద్ధంగా ఉంచారు. 192 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటుచేశారు. 64 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. ఎన్నికల నియమావళి అమలు, పోటీలో నిలిచే అభ్యర్థుల కదలికలు, ఖర్చుల పరిశీలన, సూక్ష్మ పరిశీలకులు, వ్యయ పరిశీలకుల బృందాలు విధులు నిర్వహిస్తాయి. నియోజకవర్గంలో 40 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అక్కడ అదనపు భద్రత ఏర్పాట్లు చేసినట్లుగా ఎన్నికల అధికారి వి.మదన్ మోహన్‌రావు తెలిపారు.



ఈవీఎంలు తీసుకుని పోలింగ్ కేంద్రానికి తరలి వెళుతున్న పోలింగ్ సిబ్బంది

భారీ బందోబస్తు

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అడిషనల్ ఎస్పీ కరణం కుమార్ ఆధ్వర్యంలో ముగ్గురు డీఎస్పీలు, ఎనిమిది మంది సీఐలు, 15 మంది ఎస్ఐలు, 200 మంది పోలీసు సిబ్బంది, 255 మందితో కూడిన మూడు బెటాలియన్ల ప్రత్యేక పోలీసు దళాలతో బందోబస్తు ఏర్పాటు చేశామని సీఐ ఎస్.కొండయ్య తెలిపారు.



హోప్ ఐలాండ్ దీవిలో పోలింగ్ నిర్వహణకు తరలి వెళుతున్న ఎన్నికల సిబ్బంది



ఎన్నికల నిర్వహణపై చర్చించుకుంటున్న పోలింగ్ కేంద్రాల సిబ్బంది



తమకు కేటాయించిన ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని సరిచూసుకుంటున్న పోలింగ్ సిబ్బంది

ఓటేయడం అందరి బాధ్యత

- గత ఎన్నికల్లో 74 శాతం మాత్రమే పోలింగ్
- ఈసారి ఓటింగ్ శాతం పెంచేందుకు విస్తృత ప్రచారం



అమలాపురం టౌన్: ప్రచార పర్వం ముగిసింది. హామీల వర్షం కురిసింది. ఓటరు వంతే మిగిలింది. ఓటేయడం అందరి బాధ్యత. ఈ రోజు గడిస్తే చేజారిన అవకాశం మళ్లీ రాదు. నచ్చిన నేతను ఎంచుకునే అవకాశం ఉండదు. అందుకే ప్రతి ఒక్కరూ నిరాసక్తత వీడి పోలింగ్ కేంద్రానికి తరలిరావాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. అమలాపురం నియోజవకర్గంలో 2019 ఎన్నికల్లో దాదాపు 74 శాతం మంది ఓటర్లు ఓటు వేస్తే మరో 26 శాతం మంది నిరాసక్తతను ప్రదర్శించారు. ఈ దఫాలో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు అధికారులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రధానంగా యువ ఓటర్లు ఎంతవరకూ ఓటు హక్కును వినియోగించుకుంటారన్న విషయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

పోలింగ్ శాతం పెరగడం ఖాయమా..?

అమలాపురం నియోజకవర్గంలో 2,13,508 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వారిలో 1,06,268 మంది పురుషులు, 1,07,2439 మంది మహిళలు ఉన్నారు. గత ఎన్నికలతో పోల్చిచే ఈ ఎన్నికల్లో ఓటర్లలో చైతన్యం పెరిగిందని అధికారులు భావిస్తున్నారు. ఈసారి నియోజకవర్గంలో కొత్తగా ఓటు హక్కు పొందిన 4,210 మంది యువ ఓటర్లు ఓటేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. గతంలో అధిక శాతం వృద్ధులు, దివ్యాంగులు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేసే ఓపిక లేక ఆగిపోయేవారు. అయితే ఈసారి ఎన్నికల కమిషన్ 85 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులు ఇంటి దగ్గరే ఓటేసేందుకు హోమ్ ఓటింగ్ అవకాశాన్ని తీసుకొచ్చింది. గత ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికల్లో ఓటర్లను చైతన్య పరచడానికి అటు ఎన్నికల సంఘం, ఇటు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా, నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ప్రతి దశలోనూ ప్రయత్నాలు సాగించారు. సోషల్ మీడియా ద్వారా ఓటు చైతన్యంపై విస్తృత ప్రచారాలు చేశారు. ఓటు ఎందుకు వేయాలనే సంకల్పాన్ని తెలియపరుస్తూ కళారూపాలు, లఘు చిత్రాలు ప్రదర్శించారు. దీనికి తోడు జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు శాఖతో పాటు 1,300 మందితో కూడిన కేంద్ర బలగాలతో గ్రామాల్లో కవాతు నిర్వహించి ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహిస్తామని ఓటర్లకు భరోసా కల్పించారు. ఈ ప్రయత్నాలతో ఈసారి ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరగడం ఖాయమని భావిస్తున్నారు.

నకిలీ బంగారంపై అప్రమత్తంగా ఉండాలి

అమలాపురం టౌన్: నకిలీ బంగారు నగలపై అప్రైజర్లు అప్రమత్తంగా ఉండాలని పలువురు సీనియర్ అప్రైజర్లు సూచించారు. ఆదివారం స్థానిక దుడ్డివారి అగ్రహారంలోని విశ్వ బ్రాహ్మణ కమ్యూనిటీ హాలులో అమలాపురం రీజియన్ ఎస్‌బీఐ అప్రైజర్ల సంఘం ప్రతినిధుల సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు నలమాటి కొండలరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బ్యాంక్ అప్రైజర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. అనంతరం రీజినల్ ఎస్‌బీఐ అప్రైజర్ల సభ్యుల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ నూతన అధ్యక్షునిగా కట్టోజు ఉదయభాస్కర్, కార్యదర్శిగా బాబు, ఉపాధ్యక్షునిగా సుబ్బరాజు, సంయుక్త కార్యదర్శిగా శివ, కోశాధికారిగా శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా కోసూరి శ్రీనివాస్, చేబ్రోలు శేఖర్, కట్టోజు కిషోర్ ఎన్నికయ్యారు.



ఎస్‌బీఐ అప్రైజర్ల నూతన కమిటీ సభ్యులు

అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి



పోలేకుర్రు పంచాయతీ సుంకటరేవులో పోలింగ్ విధులకు సిద్ధమైన ఎన్నికల సిబ్బంది

తాళ్లరేవు: ఓటర్లంతా స్వేచ్ఛగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, తాళ్లరేవు తహసీల్దార్ శ్రీనివాస్ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 75 పోలింగ్ కేంద్రాల్లో 66,925 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని చెప్పారు. మండలంలోని గాడిమొగ, పెదవలసల, చినవలసల, పెదబొడ్డు వెంకటాయపాలెం, లక్ష్మీపతిపురం, రామన్నపాలెం గ్రామాల్లోని 12 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపట్టామన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

నేడు కనక మహాలక్ష్మమ్మ జాతర



అప్పనపల్లి గ్రామ దేవత కనక మహాలక్ష్మమ్మ

మామిడికుదురు: అప్పనపల్లి గ్రామ దేవత శ్రీకనక మహాలక్ష్మమ్మ జాతర మహోత్సవం సోమవారం జరుగుతుందని ధర్మకర్తల మండలి చైర్మన్ తులా నాగరాజు ఆదివారం తెలిపారు. అమ్మవారి జాతర మహోత్సవాలు సోమవారం నుంచి 17వ తేదీ వరకూ జరుగుతాయన్నారు. రాత్రి అమ్మవారి జాతర, మంగళవారం అమ్మవారికి నైవేద్యాలు సమర్పిస్తారని, బుధవారం అమ్మవారి తీర్థం నిర్వహిస్తారన్నారు. 17న అన్న సమారాధన ఉంటుందని చైర్మన్ తెలిపారు. జాతర మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయం వద్ద పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

మోడల్ పోలింగ్ కేంద్రం పరిశీలన

అల్లవరం: స్థానికంగా ఏర్పాటుచేసిన మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఏఆర్‌పి, తహసీల్దార్ సునీల్‌కుమార్, ఎంపీడీఓ కృష్ణమోహన్‌లు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఆర్‌పి, తహసీల్దార్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ మండలంలోని 64 పోలింగ్ కేంద్రాల్లో 384 మంది సిబ్బంది విధులు నిర్వర్తించనన్నారన్నారు. పోలింగ్ కేంద్రానికి వచ్చే ఓటర్లకు తాగునీరు, మరుగుదొడ్లు, సహాయ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. వెయ్యి ఓట్లు దాటిన ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలను అమర్చామన్నారు. మండలంలో 15 సమస్యాత్మాక పోలింగ్ కేంద్రాలను గుర్తించి, ఈ కేంద్రాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుచేశామని చెప్పారు. శాంతియుత వాతావరణంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కుని వినియోగించుకోవాలని సూచించారు. ఆయన వెంట ఆర్ఐ దుర్గా శ్రీనివాస్, వీఆర్‌ఓలు వెంకటరెడ్డి, రత్నంరాజు, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.



అల్లవరంలోని మోడల్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏఆర్‌ఓ సునీల్‌కుమార్, ఎంపీడీఓ కృష్ణమోహన్

ఘనంగా మాతృ దినోత్సవం



శాంతకుమారిని సత్కరిస్తున్న మహిళా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు



ఛాయాదేవిని సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక మొబర్లీపేటలో అంతర్జాతీయ మాతృ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. సమావేశానికి హాజరైన వారంతా మాతృదినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి నందూరి కృష్ణమూర్తి ప్రతి కుటుంబంలో అమ్మ పోషించే పాత్ర, విశిష్టతను గురించి వివరించారు. అనంతరం నందూరి శాంతకుమారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ఎస్ఎస్ పద్మావతి, వాకర్స్ క్లబ్ ఏరియా కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, క్లబ్ కార్యదర్శి వై. అనంతలక్ష్మి, పచ్చిగోళ్ల సత్యకుమారి, వై.తులసి, శ్రీగిరి పద్మావతి, దువ్వూరి సుబ్బలక్ష్మి, పేరి లలిత, శిష్టా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్‌కు సత్కారం

అమలాపురం టౌన్: అంతర్జాతీయ మాతృ దినోత్సవం సందర్భంగా స్థానిక కల్వకొలను వీధిలో జరిగిన కార్యక్రమంలో పట్టణానికి చెందిన మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కల్వకొలను ఛాయాదేవిని ఆదివారం సత్కరించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వాకర్స్ అంతర్జాతీయ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ శర్మ, జిల్లా ఒలంపిక్ అధ్యక్షుడు అల్లాడ శరత్, వాకర్స్ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, తేతల సత్యనారాయణరెడ్డి, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసం వితరణ

ఐ పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామివారి ఆలయంలో ఉన్న వీరేశ్వర గోకులం కోసం గ్రామానికి చెందిన భక్తుడు బసవ సత్యనారాయణమూర్తి రూ.10 వేల విలువజేసే గ్రాసాన్ని ఆలయ పర్యవేక్షణాధికారి బి.వీరభద్రరావు, కొణతం సాగర్‌లకు ఆదివారం అందజేశారు.